క్లుప్తంగా

తీగలు సరిచేసిన సిబ్బంది


సరిచేసిన తీగలు చూపుతున్న రైతు

సాక్షి ఎఫెక్ట్..

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ గ్రామశి వారులో బొప్పారం భోజన్న చేనులో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. దీనిపై ఈనెల 23న సాక్షిలో 'ప్రమాదకర తీగలు సరిచేయరూ' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్ ఏఈ డి.శంకర్.. ఎల్ఐ గోవర్ధన్, సిబ్బందితో ప్రమాదకర తీగలు, కరెంట్ స్తంభాలను సరిచేశారు.

గజ్జలమ్మ దేవికి పూజలు


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మహారాష్ట్రలోని ముంబై, నాందేడ్, బోకర్, శివుని, ఇస్లాపూర్, మలక్‌జామ్, అప్పారావుపేట్ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చారు. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో గజ్జలమ్మదేవికి అభిషేకం, అలంకరణ, అర్చన, పల్లకిసేవ నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


వాహనం తనిఖీ చేస్తున్న పోలీసులు

కుంటాల: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై సీహెచ్ భాస్కరాచారి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కల్లూరు– కుంటాల రోడ్డుపై వాహనాలు తనిఖీ చేశారు. వాహనాల ధ్రువపత్రాలను పరిశీలించారు. మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని సూచించారు. ఏఎస్సైలు రాందాస్, జీవన్‌రావు, దేవన్న ఉన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన


సన్న ధాన్యాన్ని పరిశీలిస్తున్న విజయలక్ష్మి

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం డీఆర్డీవో విజయలక్ష్మి పరిశీలించారు. సన్న రకం ధాన్యాన్ని డిజిటల్ మీటర్‌తో పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. సీసీలు ఎస్.ముత్యం, ఈ ముత్యం, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

'ఏఐటీయూసీ చరిత్ర తెలుసుకోవాలి'



మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఏఐటీయూసీ చరిత్రను ప్రతి కార్మికుడు తెలుసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో ఏఐటీయూసీ జిల్లా ట్రేడ్ యూనియన్ శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కారల్‌మార్క్స్ సిద్ధాంతం ప్రకారం అధిక సంఖ్యలో కార్మికవర్గం దోపిడీకి గురవుతుందని పేర్కొన్నారు. కార్యక్ర మానికి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌చారి, కుమార్, వర్కర్స్ యూనియన్ సెక్రెటరీ పద్మకుమారి, ఏఐటీయూసీ నాయకులు భుక్య రమేశ్ పాల్గొన్నారు.

ఊర పండుగ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ కాలనీలో ఆదివారం వీడీసీ ఆధ్వర్యంలో ఘనంగా ఊరపండుగ నిర్వహించారు. శివారు ప్రాంతంలోని అమ్మవారి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పాడిపంటలు పండించి.. ప్రజలను చల్లంగ చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కౌన్సిలర్లు పురస్తు చిన్నయ్య, సాయన్న, గ్రామపెద్దలు కర్రోళ్ల శంకర్‌యాదవ్, చెనిగారపు నరేశ్, అయిండ్ల పోశెట్టి, వంజరి నర్సయ్య, మగ్గిడి రమేశ్, గిరి, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

గురుకులంలో.. క్రీడా మెరికలు

- ఆటల్లో భైంసా గురుకులం విద్యార్థినుల ప్రతిభ
- 17 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు (ఫైల్)

భైంసాటౌన్: పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు క్రీడల్లో సత్తా చాటుతున్నారు. వీరి ప్రతిభ, ఆసక్తిని గమనించిన పీఈటీలు విద్యార్థులకు నచ్చిన క్రీడల్లో శిక్షణనివ్వడంతో గ్రామీణప్రాంతం నుంచి వచ్చినా జోనల్, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణిస్తున్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ ఉత్సాహంగా పాల్గొంటూ పాఠశాలకు గుర్తింపు తీసుకొస్తున్నారు. ఇటీవల నిజామాబాద్ జిల్లా కంజరలో జరిగిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల జోనల్‌స్థాయి పోటీల్లో భైంసా పట్టణంలోని సాంఘిక సంక్షేమల బాలికల గురుకుల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. జోనల్‌స్థాయిలో 18 పతకాలు సాధించి ఓవరాల్ ఛాంపియన్ షిప్‌గా నిలిచారు. వీరిలో 17 మంది విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషం.

రాష్ట్రస్థాయికి ఎంపికైంది వీరే..

అండర్–14 విభాగంలో కబడ్డీలో స్నేహిత, ఖోఖోలో ఎస్.శ్రీనిధి, సీహెచ్.సంధ్య, ఎల్.ఆకాంక్ష, అండర్–17 విభాగంలో ఖోఖోలో బి.శరణ్య, అండర్–19 విభాగంలో జె.ప్రకృతి, అండర్–17 విభాగంలో వాలీబాల్‌లో జె. సునయన, అండర్–19 విభాగంలో బి.తేజ, అథ్లెటిక్స్‌లో కె.అనుష్క, ఎల్.ఆకాంక్ష, ఎం.సంజన, బి.స్నేహిత, జి.పూజ, కె.అనుశ్రీ, పి.జయశ్రీ, కె.అనుశ్రీ, కె.హర్షిత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

చెస్‌తో ఏకాగ్రత



ఆసక్తితోనే చెస్ ఆటపై పట్టు సాధిస్తున్నా. ఈ ఆట సాధన చేస్తే ఏకాగ్రత పెరుగుతుంది. అండర్–17 జోనల్‌స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యా. – అనుష్క, తొమ్మిదో తరగతి

ఖోఖో పోటీలకు ఎంపికయ్యా



అండర్–19 విభాగంలో ఖోఖోలో జోనల్‌స్థాయి పోటీల్లో మా జట్టు మొదటిస్థానంలో నిలిచింది. దీంతో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాను. చాలా ఆనందంగా ఉంది.

– జె.ప్రకృతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం

ప్రాక్టీస్ చేయించడంతోనే..



అండర్–17 విభాగంలో వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. రోజు పీఈటీలు ప్రాక్టీస్ చేయించడంతోనే ఈస్థాయికి చేరాం.

– జె.సునయన, తొమ్మిదో తరగతి

ఆనందంగా ఉంది



అండర్–19విభాగంలో వాలీబాల్ జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికవడం ఆనందంగా ఉంది. మాకున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ పోటీల్లో పాల్గొంటున్నాం.

–బి.తేజ, భైంసా

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే..



ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే క్రీడలపై దృష్టి సారించా. ఇటీవల జోనల్‌స్థాయి పోటీల్లో అండర్–17 విభాగంలో డిస్కస్ త్రో పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యా.

– పి.జయశ్రీ, విద్యార్థిని, భైంసా

పరుగుపందెంలో రెండోస్థానం



జోనల్ స్థాయి పోటీల్లో 800 మీటర్ల పరుగు పందెంలో రెండోస్థానంలో నిలిచా. దీంతో రాష్ట్రస్థాయికి ఎంపికవడం ఆనందంగా ఉంది. పీఈటీలు మాలో స్ఫూర్తిని నింపుతూ క్రమశిక్షణతో సాధన చేయిస్తున్నారు.

– కె.హర్షిత, ఇంటర్ ప్రథమ సంవత్సరం

ప్రొసీడింగ్ అందజేత

లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీ గ్రామంలోని పీఆర్ రోడ్లకు రూ.39లక్షలు మంజూరయ్యాయి. ఈమేరకు ఆదివారం ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి.. దేగాంలోని తన నివాసంలో నిధుల ప్రొసీడింగ్ కాపీలను గ్రామస్తులకు అందజేశారు. నాయకులు నాలం గంగాధర్, బుచ్చన్న, కిషన్, తోట నర్సయ్య, సుధాకర్, పోల్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

లక్ష్మణచాంద: మండలంలోని తిర్పెల్లి గ్రామానికి చెందిన బడుగరి నవీన్‌కు రూ.40వేల విలువైన సీఎం సహాయనిధి చెక్కు మంజూరైంది. ఆదివారం బీజేపీ నాయకులు చిన్నయ్య.. నవీన్ కుటుంబసభ్యులకు చెక్కు అందజేశారు.

యువత ఉద్యోగాలు సాధించాలి


మమతను సన్మానిస్తున్న నాయకులు

ఖానాపూర్: యువత కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలని ఏడో వార్డు కౌన్సిలర్ కిశోర్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేశ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఏడో వార్డు పరిధిలోని పద్మావతినగర్ కాలనీలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ఆకుల మమత, గడుగు నిఖిల్, బెజ్జారపు అనిల్‌ను శాలువాలతో సన్మానించారు. జూని, నయీం, భీమన్న, భాస్కర్, సురేశ్, పోశెట్టి, ప్రభాకర్, గంగాధర్, తదితరులు ఉన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

- అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్


విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్

ముధోల్: ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దని.. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్(రెవెన్యూ) అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా మరుగుదొడ్లు, స్నానపుగదులు, వంటగదిని పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఎస్‌వో ఫాతిమాబేగంకు సూచించారు. నాణ్యత లోపించిన సరుకులు, కూరగాయలు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట తహసీల్దార్ శ్రీకాంత్, పలువురు అధికారులు ఉన్నారు.

వారం రోజుల్లో డబ్బులు జమచేస్తాం

కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన ధాన్యం డబ్బులను రైతుల బ్యాంకు ఖాతాల్లో వారం రోజుల్లో జమ చేస్తామని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని వితోలి గ్రామంలో ఉన్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. తప్ప, తాలు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలన్నారు. కేంద్రాల్లో రైతులు ఇబ్బంది పడకుండా సౌకర్యాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. గన్నీ బ్యాగులు, లారీల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కేంద్రాల్లో ఎప్పటికప్పుడు స్లాబ్‌లో ఎంట్రీ చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఇప్పటివరకు సేకరించిన ధాన్యం వివరాలను మండలాధికారులకు తెలుసుకున్నారు. అంతకుముందు తహసీల్దార్ కార్యాలయంలో ఇంటింటి సర్వే డేటా ఎంట్రీ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం తరోడా గ్రామంలో ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన వారిని ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. సర్వేను నిర్ణీత సమయంలో పూర్తి చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులున్నారు.

స్థానికసంస్థల ఎన్నికల్లో బీజేపీదే గెలుపు


మాట్లాడుతున్న ఎన్నికల అధికారి ప్రేమేందర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అభ్యర్థుల గెలుపు ఖాయమని ఆ పార్టీ జిల్లా ఎన్నికల అధికారి ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం బీజేపీ సంఘటన సమీక్షా సమావేశం జిల్లాకేంద్రంలోని మారుతి ఇన్ హోటల్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం పూర్తవుతున్న సందర్భంగా బూత్‌స్థాయిలో బూత్ అధ్యక్షుల ఎన్నిక నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, జిల్లా ఎన్నికల కోరిటర్నింగ్ అధికారి సామ రాజేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు మెడిసమ్మె రాజు, పడిపెల్లి గంగాధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి పాండే, సత్యనారాయణగౌడ్, మల్లికార్జున్‌రెడ్డి, నారాయణరెడ్డి, గోపాల్ సర్డా, రితేశ్‌రాథోడ్, సుష్మారెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శాంతియాగం


దీపోత్సవంలో మహిళలు


హోమంలో ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని డిగ్రీ కళాశాల ఎదుట నిర్వహిస్తున్న శ్రీ వైష్ణవ ఆయుత చండీ అతిరుద్ర మహాయాగం వైభవంగా కొనసాగుతోంది. లోకకల్యాణం కోసం ఈనెల 10న ప్రారంభమైన 84వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవాలు ఈనెల 25వరకు కొనసాగనున్నాయి. శనివారం రాత్రి శ్రీకృష్ణజ్యోతి స్వరూపానంద సరస్వతి స్వామీజీ ఆధ్వర్యంలో లక్ష దీపోత్సవం చేపట్టగా.. గోమయంతో చేసిన దీపాలను మహిళలు వెలిగించారు. ఆదివారం శాంతియాగంలో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పీఠాధిపతి కృష్ణ స్వామీజీ దివ్య మంగళ ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఇందులో పట్టణంతోపాటు, గ్రామాల భక్తులు వచ్చి పూజలు చేశారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, వెంగల్‌రావు, దేవేందర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా


ప్రొసీడింగ్ కాపీ అందిస్తున్న ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్

ముధోల్: ప్రజలంతా ఐక్యంగా ఉండాలని.. గ్రామాలాభివృద్ధికి తమవంతు కృషి చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. మండలంలోని బోరిగాం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.60లక్షలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన ప్రొసీడింగ్‌ను ఆదివారం ముధోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రామస్తులకు అందజేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మండలంలోని వితోలి గ్రామానికి చెందిన జె.ఆనంద్‌కు రూ.26వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. వారి వెంట నాయకులు ఉన్నారు.

పరామర్శ

ముధోల్: మండలంలోని వితోలి గ్రామానికి చెందిన కె.లింగారావు, తరోడా గ్రామానికి చెందిన అల్తాఫ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆదివారం బాధిత కుటుంబాలను ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పరామర్శించారు. మృతికి కారణాలు తెలుసుకొని ధైర్యం చెప్పారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

లోకేశ్వరం: మండలంలోని సాథ్‌గాం గ్రామానికి చెందిన శకుంతలబాయికి రూ.60వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆదివారం భైంసా పట్టణంలోని తన నివాసంలో ఎమ్మెల్యే రామారావుపటేల్ చెక్కు అందజేశారు. కిశోర్ పటేల్ తదితరులున్నారు.

సింహగర్జన సభను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న నాయకులు

భైంసాటౌన్: మాలల ఐక్యత చాటేలా డిసెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించే మాలల సింహగర్జన సభకు తరలిరావాలని మాలమహానాడు తాలూకా అధ్యక్షుడు భీంరావు డోంగ్రే పిలుపునిచ్చారు. మాల మహానాడు రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఆదివారం పట్టణంలోని బుద్ధవిహార్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా, ప్రతి గ్రామం నుంచి మాల కులస్తులు తరలివచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు. కౌన్సిలర్ రాహుల్ దగ్డే, యశ్వంత్, గంగాధర్, భీంరావు చంద్రే, చాకేటి లస్మన్న, అంబేద్కర్, మాల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడికి యత్నం

నర్సాపూర్(జి): ఓ బాలిక (11)పై ఇద్దరు లైంగికదాడికి యత్నించిన ఘటన ఆదివారం మండలకేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై హన్మాండ్లు తెలిపిన వివరాల మేరకు... నర్సాపూర్ (జి) మండలకేంద్రానికి చెందిన ఓ బాలికకు అదే గ్రామానికి చెందిన ఇద్దరు(యువకుడు, మధ్య వయస్కుడు) ఫోన్ చేసి స్థానిక బసం చెరువు దగ్గరకు రప్పించారు. అనంతరం లైంగికంగా వేధించడంతో బాలిక ఏడుపులు విని ఓ వ్యక్తి రావడంతో నిందితులు పారిపోయారు. బాధిత బాలిక తల్లి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సబ్‌స్టేషన్‌కు మరమ్మతులు

ఖానాపూర్: పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులను ఆదివారం చేపట్టారు. పలు కాలనీలతో పాటు ఎక్బాల్‌పూర్ గ్రామానికి విద్యుత్ సరఫరాను నిలిపివేసి పవర్ ట్రాన్స్‌ఫార్మర్ రీ ఎర్తింగ్ పనులను అధికారులు, సిబ్బంది చేపట్టారు. వినియోగదారులకు ఇబ్బంది కాకుండా ఏఈ రాంసింగ్ దగ్గరుండి మరమ్మతులు చేయించారు.

గుర్తుకొస్తున్నాయి..


సమ్మేళనానికి హాజరైన పూర్వవిద్యార్థులు

లోకేశ్వరం: వారంతా ఒకేచోట చదువుకున్నారు. క్లాస్‌లో ఒకరికొకరు పోటీపడి చదివారు. మైదానంలో నువ్వా.. నేనా.. అంటూ తలపడ్డారు. అల్లరి చేష్టలతో గురువుగారి బెత్తం దెబ్బల రుచి చూశారు. చివరికి పాఠశాలలో చదువు పూర్తి చేసుకుని వివిధ ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. మండలంలోని కన్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003–2004లో పదో తరగతి చదివిన వీరు ఆదివారం 'పూర్వ విద్యార్థుల సమ్మేళనం' పేరిట కలుసుకున్నారు. ఇందుకు స్థానిక మున్నూరు కాపు కల్యాణ మండపం వేదికైంది. వీరంతా ఒకరినొకరు పలకరించుకొని సరదాగా గడిపారు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు సత్యపాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, బుచ్చయ్య, కాశీరాం, సూర్యకాంత్, రాంచందర్ రెడ్డి, గంగాధర్‌ను ఆహ్వానించి సన్మానించారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులు

ఖానాపూర్: హైదరాబాద్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు (తొమ్మిది మంది) ప్రతిభ కనబరిచినట్లు హెచ్ఎం బోనగిరి నరేందర్, పీఈటీ ఇమ్రాన్ తెలిపారు. 67కిలోల విభాగంలో శివసాయి బంగారు పతకం, 61 కిలోల విభాగంలో రాజు వెండి పతకం, 49 కిలోల విభాగంలో విష్ణు వెండి, 55కిలోల విభాగంలో గౌతమ్ వెండి, 55 కిలోల విభాగంలో రాహుల్ వెండి, 67 కిలోల విభాగంలో రిషేందర్ కాంస్యం, 64 కిలోల విభాగంలో నిషితవర్తిని వెండి, 54 కిలోల విభాగంలో సంహిత కాంస్యం, 45 కిలోల విభాగంలో శ్రీనిధి వెండి పతకం సాధించినట్లు పేర్కొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు వందశాతం హాజరు


పరీక్ష కేంద్రం వద్ద డీఈవో రామారావు

ఖానాపూర్/కడెం: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్షకు 237 మందికి గాను వందశాతం హాజరైనట్లు హెచ్ఎం, కేంద్ర సూపరింటెండెంట్ సంధ్యారాణి తెలిపారు. పరీక్షకు ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. కడెంలోని లింగాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 42 మంది హాజరైనట్లు హెచ్ఎం వెంకటరమణ తెలిపారు. జాతీయ ఉపకార వేతనాల ఎంపికకు జరిగిన ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్ష కేంద్రాన్ని డీఈవో రామారావ్, ఎంఈవో ప్రేంసాగర్ పరిశీలించారు.

ఎన్‌సీసీ వేడుకలు


కస్బా పాఠశాలలో పరేడ్ నిర్వహిస్తున్న కెడెట్లు

నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలోని జుమ్మేరాత్పేట్ పాఠశాల, కస్బా ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎన్‌సీసీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జుమ్మేరాత్పేట్ ఇన్‌చార్జి హెచ్‌ఎం దత్తురాం, ఎన్‌సీసీ ఇన్‌చార్జి శ్రీనివాస్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలతోపాటు విపత్తు వేళ ఎన్‌సీసీ కెడెట్లు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. అనంతరం వృద్ధాశ్రమంలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కస్బా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్, ఎన్‌సీసీ అధికారి వై.సాయన్న తదితరులు పాల్గొన్నారు.